
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం, 9, అక్టోబర్, 2023



సోమశిలలో 29.670 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 29.670 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1,607 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.58,570
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,277
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,435
నవర (8 గ్రా) -	రూ.43,480

గరిష్ఠం/కనిష్ఠం
38.1 /26.2

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 74 శాతం ఉంది. సోమవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

కామాక్షితాయి సేవలో జిల్లా జడ్జి



న్యాయమూర్తికి ప్రసాదాలు అందజేస్తున్న ఈఓ గిరికృష్ణ

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ క్షేత్రంలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని నెల్లూరు జిల్లా 5వ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి సరస్వతి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వి.గిరికృష్ణ న్యాయమూర్తికి స్వాగతం పలికారు. ఆలయంలోని గణపతిస్వామి, మల్లికార్జునస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కామాక్షితాయి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలతో న్యాయమూర్తిని సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు.

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న రామిరెడ్డి రోజారెడ్డి

నెల్లూరు(లీగల్): ప్రతి మధ్యంతర పిటిషన్‌పై రూ.20 విలువ గల వెల్ఫేర్ స్టాంపు అంటించాలనే నిబంధనలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని ఆ పార్టీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి రామిరెడ్డి రోజారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలతో ఈ ప్రతిపాదనకు ముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ న్యాయవాదుల అభిప్రాయాలను సేకరించి అందరి ఏకాభిప్రాయంతోనే చట్ట సవరణకు ప్రతిపాదన పంపిందని భావించి ఏపీ ప్రభుత్వం చట్ట సవరణ చేసిందన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం పాత్ర ఏమీలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ న్యాయవాదుల అభిప్రాయాన్ని తెలుసుకోకుండా చట్ట సవరణ కోరడాన్ని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఖండిస్తూ దీనిపై పునరాలోచన చేయాలని ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్‌ను డిమాండ్ చేస్తుందన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లవేళలా తోడ్పాటుగా నిలుస్తున్నారని తెలిపారు.

తహసీల్దార్ల బదిలీలు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పలువురు తహసీల్దార్లు బదిలీ అయ్యారు. సెక్రటేరియట్ నుంచి జిల్లాకు వచ్చిన డిప్యూటీ కలెక్టర్ హనోక్‌బాబు ఏఎస్‌పేట తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఏఎస్‌పేట తహసీల్దార్ ఏపీ రమణరావు వరికుంటపాడు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. గతంలో ఉదయగిరి తహసీల్దార్‌గా పనిచేసిన వి.జగదీష్‌బాబును ఆత్మకూరు తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన ఎస్.రామ్మోహన్‌రావు దుత్తలూరు తహసీల్దార్‌గా నియమితులయ్యారు.

ఇంటర్ సర్టిఫికెట్లు అందించండి



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు(టౌన్): 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థికి పాస్ సర్టిఫికెట్లు అందజేయాలని ఆర్‌ఐఓ శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్‌ఐఓ కార్యాలయంలో జిల్లాలోని ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌కు డిజి లాకర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సర్టిఫికెట్లు ఎలా భద్రపరుచుకోవాలనే అంశంపై డెమో ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు బకాయిల లాంటి కారణాలతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోతే బోర్డు నిబంధనల ప్రకారం అలాంటి కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిజి లాకర్ యాప్ ద్వారా విద్యార్థులు సర్టిఫికెట్లు భద్రపరుచుకునేలా వారికి దిశానిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీవీఈఓ మధుబాబు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.



సెల్‌ఫోన్ గేమ్స్.. యమ డేంజర్

మానసిక ఒత్తిడి, ఒంటరితనం యువతను సెల్‌ఫోన్ గేమ్స్ వైపు మళ్లిస్తోంది. ఈ క్రమంలో టీనేజర్లను టార్గెట్ చేస్తూ వారి ప్రాణాలు బలిగొంటున్న భయంకరమైన చాలెంజ్ గేమ్స్ కూడా ఉన్నాయి. ఈ గేమ్స్ ఆడుతున్న వారు 10 నుంచి 19 ఏళ్ల లోపు వారే అధికంగా ఉన్నారని తెలుస్తోంది. ఈ సెల్‌ఫోన్ గేమ్స్‌కు బానిసై ఆత్మహత్యలు చేసుకోవడం, అనారోగ్యంపాలు కావడం జరుగుతోందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ గేమ్స్ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

బానిసవుతున్న యువత

- మనసును గేమ్స్ వైపు మళ్లిస్తున్న ఒంటరితనం
- అర్ధరాత్రి వరకు సెల్‌ఫోన్ల వినియోగమూ కారణమే
- మెదడుపై ప్రభావం చూపుతుందంటున్న వైద్యులు

నెల్లూరు(బారకాసు): సెల్‌ఫోన్‌లో పిల్లలు, యువత ఆడే గేమ్స్ యమ డేంజర్‌గా మారాయి. నిద్ర, ఆహారంతో సంబంధం లేకుండా అర్ధరాత్రి వరకు స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్న యువత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్ ఆటలపై వ్యామోహం పెంచుకున్న పిల్లలను మెల్లగా ఎలక్ట్రానిక్ పరికరాలకు ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉంచేలా చూడడం ప్రస్తుతం తల్లిదండ్రుల తక్షణ కర్తవ్యం. ఒకప్పుడు విదేశాలకే పరిమితమైన పబ్‌జీ (ప్రస్తుతం పేరు మారింది) తదితర గేమ్స్ మహా నగరాలతోపాటు ప్రస్తుతం అన్ని ప్రాంతాలకు విస్తరించాయి. ప్రమాదకరమైన ఈ గేమ్స్‌కు బానిసై అనారోగ్య సమస్యలతో ఆస్పత్రులకు చేరుకుంటున్న యువత సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ గేమ్స్ ఆడుతున్న వారు మానసిక రుగ్మతతో పిచ్చివాళ్లలా ప్రవర్తిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా.. ఆ గేమ్ ఆడొద్దని ఎవరైనా చెబితే ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వరకు వస్తోంది. మరికొందరు హత్యలు చేస్తున్న సందర్భాలు కూడా వెలుగు చూస్తున్నాయి. తొలుత 'పోకేమాన్' అంటూ రోడ్డున పడిన యువత.. ఆ తర్వాత గేమింగ్‌కు బానిసై ఆత్మహత్యలు చేసుకోవడం తెలిసిందే.

ఆందోళనకు గురిచేస్తూ..

మహా నగరాల్లో పలువురు యువకులు పరీక్షల సమయంలో చదువుకోకుండా సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుతున్నారు. వీరిలో కొందరు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలియగా.. మరికొందరు మెదడులోని రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టి కాలు, చేయి పడిపోయి ఆస్పత్రి పాలై చికిత్స పొందుతున్న ఘటనలు కూడా అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.

ఆటలో లీనమైతే అంతే



ఈ సెల్‌ఫోన్ గేమ్స్ ఆడాలంటే ముందుగా యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత ఐడీ లభిస్తుంది. అయితే ఈ ఆటను సింగిల్‌గా కాకుండా జట్టుగా ఆడితేనే మజా ఉంటుందని యువత భావిస్తారు. దీంతో కొంతమంది టీమ్‌గా ఏర్పడి మరీ ఈ గేమ్స్ ఆడుతున్నారు. ఆటాడే సమయంలో వీరు ఇతరులను పట్టించుకోరు. గేమ్ నుంచి దృష్టి మరల్చితే శత్రువులు చంపేస్తారనే భయంతో పరిసరాలను మరచిపోతుంటారు. ఏకాగ్రత లోపించి చదువులో వెనకబడి పోతుంటారు. ఆ సమయంలో ఎవరైనా ఫోన్ చేసినా, పిలిచినా పట్టించుకోరు. ఎవరైనా డిస్టర్బ్ చేస్తే అసహనం ప్రదర్శిస్తారు. కొంత మంది కోపంతో ఊగిపోతారని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ గేమ్స్ ఆడే వ్యక్తులు సైనికులుగా మారిపోయి స్వయంగా యుద్ధరంగంలోకి దిగి శత్రువులతో పోరాడుతున్నామనే భావనలో ఉంటారు. ఒకసారి ఆట మొదలైందంటే యుద్ధంలో ఉన్నట్లే. ఈ ఆటలో లీనమైనవారు అప్రమత్తంగా లేకపోతే శత్రువులు చంపేస్తారనే భావనతో పక్కన ఎవరున్నారు? ఏం జరుగుతోంది? అనే అంశాలనే కాదు చివరికి నిద్రాహారాలనే మరచిపోతుంటారు. ఆటలో లీనమైతే మళ్లీ బయటకు రావడం కష్టమే. పైగా గ్రూప్‌తో కలిసి ఆడినప్పుడు మరింత ఆసక్తికరంగా ఉంటుంది. ఈ ఆట ఆడేవారు తమని తాము సైనికులుగా భావిస్తారు. ఇది గ్రూప్ వాయిస్ గేమ్ కావడంతో యుద్ధం చేస్తుంది తామేననే భావన ఏర్పడి, తెలియకుండానే ఈ గేమ్‌కు బానిసలుగా మారి.. చివరకు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని పలువురు మానసిక వైద్యనిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా పిల్లలు, యువత ఈ ప్రమాదకరమైన సెల్‌ఫోన్ గేమ్స్‌కు బానిస కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

మానసిక సమస్యలు



సెల్‌ఫోన్‌లో ఆడే గేమ్స్‌తో పిల్లల మానసిక, శారీరక స్థితి తీవ్రంగా దెబ్బతింటోందని ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. ఈ ఆటకు బానిసలైన యువత నిద్రలేమి, సమయానికి ఆహారం తీసుకోకపోవడంతో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. గంటల తరబడి ఒకేచోట కూర్చొని ఆడడంతో మానసిక సమస్యలు తలెత్తుతాయి.

– డాక్టర్ సంపత్‌కుమార్, న్యూరాలజిస్ట్, నారాయణ ఆస్పత్రి

ప్రమాదకర గేమ్స్‌ను నిషేధించాలి



యువత రోజుకు 6 నుంచి 10 గంటల సేపు పబ్‌జీ లాంటి గేమ్స్ ఆడుతున్నారు. దానికోసం అన్ని పనులను వదులుకునే స్థాయికి వస్తున్నారు. దీంతో కొన్ని రాష్ట్రాలు ఈ గేమ్‌పై నిషేధం విధించాయి. ఇటీవల జమ్మూలో ఓ ఫిట్‌నెస్ ట్రైనర్ పబ్‌జీకి బానిసై పిచ్చివాడయ్యాడు. దీంతో అక్కడి ప్రభుత్వం పబ్‌జీని నిషేధించింది.

– డాక్టర్ ఎంవీ రమణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రజారోగ్య వేదిక

తల్లిదండ్రులు తప్పు చేస్తున్నారు



చాలామంది తల్లిదండ్రులు మొండి స్వభావం ఉన్న, మారాం చేసే పిల్లలకు సెల్‌ఫోన్‌ను ఆటవస్తువులా ఇచ్చి తప్పు చేస్తున్నారు. పిల్లలు సెల్‌ఫోన్‌కు బానిసై మిగతా కోణాల్లో ఎదగలేరు. చదువులోనూ వెనుకబడిపోతారు. సెల్‌ఫోన్ చిన్నపిల్లల ఎదుగుదలకు ప్రతిబంధకం.

– డాక్టర్ శ్రీనివాసతేజ, మానసిక వైద్యనిపుణుడు

బీమాతో భరోసా

వైఎస్సార్ బీమా సామాన్యులకు అండగా నిలుస్తోంది.. బీమా ప్రీమియం చెల్లించిన వారు సహజ మరణం పొందినా, ప్రమాదవశాత్తు మృతిచెందినా.. వెంటనే బీమా మొత్తాన్ని బాధిత కుటుంబానికి చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- వైఎస్సార్ బీమాతో సామాన్యుడికి ధీమా
- వారంలోనే క్లెయిమ్ నగదు చెల్లింపు
- పది రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు భరోసా కల్పించేలా అందజేస్తున్న వైఎస్సార్ బీమా సామాన్యుడి పాలిట వరంలా మారింది. బీమా చెల్లించిన వారు మృతిచెందితే ప్రభుత్వం అతి తక్కువ సమయంలోనే పరిహారం అందజేస్తోంది. ప్రభుత్వం ఈ క్లెయిమ్‌ల చెల్లింపులకు అత్యాధునిక విధానాన్ని తీసుకొచ్చింది. బీమా కంపెనీలు లబ్ధిదారులకు నగదు అందజేయడంలో జాప్యానికి చెక్ పెట్టింది. బీమా చేసుకున్న వ్యక్తి మరణిస్తే నాలుగు నుంచి పది రోజుల్లోపు అందాల్సిన బీమా మొత్తాన్ని వారి కుటుంబసభ్యులైన లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తోంది.

జిల్లాలో బీమా క్లెయిమ్‌ల వివరాలు

సంవత్సరం	సహజ మరణాలు	ప్రమాదవశాత్తు మరణించిన వారు	ప్రమాదాల్లో వైకల్యం పొందినవారు	చెల్లించిన బీమా (రూ.కోట్లలో)
2021-22	1,493 మంది	203 మంది	02	14.93
2022-23	1,500 మంది	195 మంది	00	15
2023-24	373 మంది	44 మంది	00	3.52

గతంలో ఇలా..

గతంలో బీమా నగదు చెల్లింపులు ఆయా బీమా కంపెనీల పరిధిలో ఉండేవి. దీంతో లబ్ధిదారులు నెలల తరబడి పడిగాపులు కాసేవారు. లేనిపోని అంక్షలు పెడుతూ కాలయాపన చేసేవారు. అయితే ప్రభుత్వం ఈ జాప్యంలోని సమస్యలను గుర్తించింది. బీమా మొత్తం చెల్లింపు విషయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీకి సర్వాధికారాలు అప్పగించింది. దీంతో దరఖాస్తు కార్యాలయానికి చేరిన వెంటనే ఆ మొత్తాన్ని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నెల నుంచి వచ్చిన క్లెయిమ్‌లు తక్కువ రోజుల్లోనే విడుదల కావడంతో బాధితులకు వెంటనే న్యాయం జరుగుతోంది.

ప్రస్తుతం సులభతరం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీమా ప్రక్రియను సులభతరం చేసింది. కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో చితికిపోకుండా వైఎస్సార్ బీమా పేరిట పథకాన్ని అమలు చేస్తోంది. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఈ బీమా ఎంతగానో ఉపయోగపడుతోంది.

గతంలో చాలా ఆలస్యమయ్యేది

గతంలో బీమా క్లెయిమ్‌ల చెల్లింపుల్లో చాలా ఆలస్యమయ్యేది. బీమా ప్రీమియం చెల్లించినా ప్రైవేట్ కంపెనీలు చిన్న చిన్న కారణాలతో జాప్యం చేసేవి. ప్రస్తుతం బీమా చెల్లింపులను ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని క్లెయిమ్‌లు వచ్చిన వెంటనే వారం రోజుల్లో పరిశీలించి లబ్ధిదారుల ఖాతాల్లో బీమా మొత్తాన్ని జమ చేస్తోంది. చిన్న చిన్న లోపాలున్నా ప్రభుత్వం మానవతా దృక్పథంతో బీమా చెల్లింపులకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో లబ్ధిదారులకు సత్వరమే బీమా చెల్లింపులు చేస్తున్నాం.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

బీమా ఇలా..

వయస్సు ఆధారంగా బీమా నగదు చెల్లింపులు ఉంటాయి. 18–50 ఏళ్ల మధ్య వయస్సు వారు కుటుంబ పెద్ద అయి ఉండి సాధారణ మరణం చెందితే రూ.లక్ష అందజేస్తారు. అదే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది. అలాగే 18–70 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు ప్రమాదవశాత్తు మృతిచెందితే వారికి రూ.5 లక్షల పరిహారం ఇస్తున్నారు. ప్రమాదవశాత్తు వ్యక్తి వికలాంగుడైతే రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పరిహారం చెల్లిస్తారు. ఏటా క్లెయిమ్‌లను జూలై 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు లెక్కిస్తారు.

వివక్షను వీడి సమరసతను సాధించాలి



మాట్లాడుతున్న కమలానందభారతి స్వామి

- భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి స్వామి

వెంకటాచలం: వివక్షను వీడి సమరసతను సాధించాలని భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి స్వామి పిలుపునిచ్చారు. వెంకటాచలం మండలంలోని గొలగమూడి వద్దనున్న భగవాన్ శ్రీవెంకయ్య స్వామి ఆడిటోరియంలో ఆదివారం పీటీ జగన్నాథాచారి అధ్యక్షతన నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల సమరసత సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి మాట్లాడుతూ కుల వివక్షను వీడి సమాజాన్ని సరమసత వైపు దృష్టి మరలించేదుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమాజంలో మార్పు కోసం మార్గదర్శనం అవసరమని పేర్కొన్నారు. హిందూ ధర్మం, భారతీయత సాధించేందుకు కులాలకు అతీతంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు సమరసత సమ్మేళనం ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సహ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, పోట్లూరు శ్రీనివాసులు, డాక్టర్ వేణుదీక్షిత్, కోట సునీల్‌కుమార్, నేలనూతల శ్రీధర్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనానికి హాజరైన వారు

బాబు అవినీతిపై చర్చకు సిద్ధం

- టీడీపీ నాయకుల విమర్శలపై ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ తూమాటి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తూమాటి

కందుకూరు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంపై తాను శాసనమండలిలో మాట్లాడిన మాటలకు సంబంధించి టీడీపీ నాయకులు విమర్శలు చేయడంపై ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు తీవ్రస్థాయిలో స్పందించారు. తనను లక్ష్యం చేసుకుని చేసిన వ్యక్తిగత విమర్శలను తిప్పికొట్టారు. ఈ మేరకు ఆదివారం స్థానికంగా ఉన్న తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు అవినీతి చేశాడనే దానికి బలమైన ఆధారాలు ఉండడం వల్లే అరెస్ట్ చేశారని చెప్పానని, దానిని ఓర్చుకోలేని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం తనపై వ్యక్తిగత విమర్శలు చేశారన్నారు. తెలుగుదేశం పార్టీలో తాను లబ్ధి పొందానని చెప్తున్నారని, కానీ టీడీపీ వల్ల తనకు ఎటువంటి లబ్ధి జరగలేదన్నారు. తానే పార్టీ అభివృద్ధికి అనేక విధాలుగా సహాయ సహకారాలు నాడు అందించానని స్పష్టం చేశారు. 2007 మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు నాడు మాజీ ఎమ్మెల్యే దివి శివరాంకు రూ.30 లక్షల ఇచ్చానని, అది నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కానీ తరువాత కాలంలో చంద్రబాబునాయుడు విధానాలు నచ్చక పార్టీ నుంచి బయటకు వచ్చానని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కృషిని గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని, శక్తి మేరకు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని స్పష్టం చేశారు.

చంద్రబాబు అవినీతి గురించే మాట్లాడా..

మండలిలో మాట్లాడిన సమయంలో తాను కేవలం చంద్రబాబు చేసిన అవినీతి గురించే మాట్లాడానని స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కీంలో చంద్రబాబు అవినీతికి పాల్పడినట్లు కోర్టులు నమ్మాయి కాబట్టే చంద్రబాబును జైలుకు పంపారని అన్నారు.

పార్టీని దెబ్బతీసిన చరిత్ర నీదే

తాను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి నష్టం చేయడం తన పని అని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం చేసిన వ్యాఖ్యలపై తూమాటి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి చరిత్ర ఏంటో ప్రజలకు తెలుసనని స్పష్టం చేశారు. టీడీపీలో ఉంటూనే పార్టీని దెబ్బతీసిన చరిత్రనీదేనని శివరాంపై ధ్వజమెత్తారు. 2019 ఎన్నికల్లో శివరాం చేసిన ఘనకార్యం అందరికీ తెలిసిందేనని, ఆ రోజు ఎన్నికల్లో పోతుల రామారావును ఓడిచేందుకు సర్వశక్తులు ఒడ్డినమాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అలాంటి శివరాం తనని బ్లాక్ మెయిల్ చేసేలా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

ముగిసిన ఆంధ్ర క్రికెట్ జట్టు శిక్షణ శిబిరం



జాతీయస్థాయి టోర్నీలో పాల్గొనే ఆంధ్ర క్రికెట్ జట్టు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీసీసీఐ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వినుమన్కడ్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర క్రికెట్ జట్టు శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో బుజబుజ నెల్లూరు ఆంధ్ర క్రికెట్ అకాడమీ మైదానంలో ఏపీ అండర్–19 క్రికెట్ జట్టుకు వారం రోజులు ప్రణాళికాబద్ధంగా శిక్షణ ఇచ్చామని టీం హెడ్ కోచ్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి జాతీయస్థాయిలో చత్తీస్‌ఘడ్‌లో నిర్వహించే వినుమన్కడ్ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభచూపిన క్రీడాకారులను అండర్–19 భారత్–ఎ, భారత్–బి జట్లకు ఎంపిక చేస్తారని తెలిపారు. నెల్లూరులో శిక్షణశిబిరాన్ని జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఏపీ అసిస్టెంట్ కోచ్‌లు వి.లెనిన్, అశ్వనీకుమార్‌రాజు, ఫీల్డింగ్ కోచ్ రాధాకృష్ణ, మేనేజర్ నవాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- వైద్య పరీక్షల్లో గుండె జబ్బు ఉన్నట్లు గుర్తింపు
- తక్షణమే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యానికి సిఫార్సు



నెల్లూరులోని ఆస్పత్రిలో మాల్యాద్రిని పరామర్శిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు

కావలి: అతను పైకి ఆరోగ్యంగానే ఉన్నాడు. జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్యులు అతనిలోని అనారోగ్యాన్ని గుర్తించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇటీవల దగదర్తి మండలం తడకలూరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఉదయగిరి మాల్యాద్రికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అతనికి గుండెకు సంబంధించిన అనారోగ్య సమస్య ఉందని గుర్తించి ఆలస్యం చేయకుండా తక్షణమే చికిత్స చేయించుకోవాలని, లేకపోతే ప్రాణాలకు హాని ఉందని చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద నెల్లూరులో కార్పొరేట్ వైద్యానికి సిఫా ర్సు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్ నాయుడు తక్షణ వైద్య సహాయం కోసం అధికారులకుతెలియజేశారు. మాల్యాద్రికి ఆరోగ్యశ్రీ కింద గుండెకు సంబంధించిన చికిత్స చేయడానికి అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవడంతో, నెల్లూరులోని కార్పొరేట్ హాస్పిటల్‌లో చేరి వైద్యం చేయించుకోవడంతో ప్రాణాపాయం నుంచి క్షేమంగా బయటపడ్డాడు.

షార్ ఆధ్వర్యంలో స్పేస్ వాక్



స్పేస్ వాక్ ర్యాలీని ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ ఆధ్వర్యంలో ఆదివారం సూళ్లూరుపేట పట్టణంలో స్పేస్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి డీఓఎస్ కాలనీ వరకు నిర్వహించిన స్పేస్ వాక్ కార్యక్రమాన్ని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రో చేస్తున్న ప్రయోగాలతో సాధించిన సాంకేతిక ప్రగతి గురించి తెలియజేసేందుకే ఈ స్పేస్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు విచ్చేసి స్పేస్ వాక్ ర్యాలీలో పాల్గొని, భరతమాతకు జై, ఇస్రో జై జై అంటూ నినాదాలు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో షార్ అధికారులు భవిష్యత్తులో ప్రయోగించబోయే మానవ సహిత ప్రయోగ రాకెట్ హ్యూమన్ రేటెడ్ లాంచింగ్ వెహికల్ (హెచ్‌ఆర్‌ఎల్‌వీ) నమూనాను ప్రదర్శించారు.

బంగారు బొట్టు బహూకరణ



కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ క్షేత్రంలో వెలసిన కామాక్షితాయి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన పార్లపల్లి రవీంద్ర – వాసవి దంపతులు 9.970 గ్రాముల బంగారు బొట్టును ఆదివారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండలి చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వి.గిరికృష్ణ దాతలకు మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు.

క్లుప్తంగా

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఆదివారం తెలిపారు. 1వ యూనిట్లో 355, 2వ యూనిట్లో 400 మెగావాట్ల వంతున విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాలతో మూడో యూనిట్లో ఉత్పత్తి నిలిపివేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



ఘటనాస్థలంలో క్షతగాత్రుడు రమణయ్య

వెంకటాచలం: రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడ్ని స్కూటీ ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చెముడుగుంట వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..చెముడుగుంట గ్రామానికి చెందిన పాదిలి రమణయ్య(63) జాతీయ రహదారి దాటుతుండగా, నెల్లూరు నుంచి వెంకటాచలం వైపు వెళుతున్న స్కూటీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్కూటీపై ఉన్న నెల్లూరు రూరల్ మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన కృష్ణకాంత్, మునిసాయికు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు బోల్తా



జాతీయ రహదారి పక్కన గుంతలో బోల్తా పడిన కారు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం సింగనపల్లి సమీపంలో ఆదివారం 565 జాతీయ రహదారిపై వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న వ్యక్తి ప్రాణాలతో సురక్షితంగా బయటపడినట్లు స్థానికులు తెలిపారు. కాగా అటుగా వెళ్తున్న కొందరు యువకులు ఫొటోలు తీసేందుకు యత్నించగా కారులోని వ్యక్తి కనిపించకుండా పక్కనే ఉన్న అడవిలోకి వెళ్లాడని చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

ఆత్మహత్యకు యత్నించిన లైన్‌మన్

- కాపాడిన కానిస్టేబుల్

కోవూరు : కుటుంబ కలహాలతో ఆదివారం రైలు పట్టాలపై ఆత్మహత్యకు యత్నించిన ఓ విద్యుత్ లైన్‌మన్‌ను పోలీసులు సురక్షితంగా కాపాడారు. వివరాలు..కోవూరులో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి కొడవలూరు మండలంలో విద్యుత్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన సహచర లైన్‌మన్‌కు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి కట్ చేశాడు. స్పందించిన సదరు లైన్‌మన్ వెంటనే కోవూరులో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పోసిన సునీల్‌కుమార్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఆదేశాల మేరకు సునీల్‌కుమార్ సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా కోవూరు సమీపంలో పట్టాలపై పడుకుని ఉన్న లైన్‌మన్‌ను గుర్తించి కాపాడాడు. అనంతరం ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు

వరికుంటపాడు: మండలంలోని కాంచెరువు సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఎస్సై విజయ్‌శ్రీనివాస్ ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. 15 మోటార్ సైకిళ్లు, 10 కోళ్లు, రూ.2వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

కావలి: మండలంలోని చలంచర్ల సమీపంలో పొలాల్లో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరాలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. గుట్టుగా కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో రూరల్ ఎస్సై సుమన్ తన సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2210 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.125
లేయర్ (లైవ్)	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.220
స్కిన్‌లెస్ చికెన్	: రూ.242
లేయర్ చికెన్	: రూ.200

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.5

పేదలకు మెరుగైన వైద్యసేవలు

పొదలకూరు సీహెచ్‌సీలో తీరిన వైద్యుల కొరత

- రాత్రి వేళల్లోనూ అందుబాటులో వైద్యులు
- ఆరోగ్యశ్రీ పరిధిలోకి సీహెచ్‌సీ
- ఎక్స్‌రే, బ్లడ్‌బ్యాంక్ కేంద్రాల ఏర్పాటు
- రోగులకు భోజన సౌకర్యం



పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం

పొదలకూరు :ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకరించి అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తోంది. వైద్యసిబ్బందిని భర్తీ చేస్తోంది. తద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తోంది. గతంలో ప్రభుత్వ ఆస్పత్రులు మౌలిక వసతుల లేమి, వైద్యసిబ్బంది, మందుల కొరత, తదితర సమస్యలతో కునారిల్లుతుండేవి. దీంతో ప్రభుత్వ వైద్యంపై ప్రజలు విముఖత చూపేవారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి సారించి నాడు–నేడు ద్వారా మౌలిక వసతులు కల్పించడంతో పరిస్థితులు మారిపోయాయి. పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం చుట్టుపక్కల మండలాలకు సైతం ఎంతో ఉపయోగపడుతోంది. సీహెచ్‌సీపై అభివృద్ధి కమిటీ చైర్మన్ అయిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి సమూల మార్పులు తీసుకొచ్చారు. మందులు, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచారు. ప్రాథమికంగా ఆక్సిజన్‌ను అందించేందుకు దాతల సహకారంతో కాన్సన్‌ట్రేటర్లను సీహెచ్‌సీకు అందజేశారు.

సీహెచ్‌సీలో సమూలమార్పులు

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, నర్సులను నియమించడంతో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. ప్రస్తుతం సీహెచ్‌సీలో గర్భకోశ వ్యాధి నిపుణుడు, చిన్నపిల్లల వైద్యనిపుణుడు, మత్తు వైద్యుడు, దంత, ఫిజియోథెరపి వైద్యులు, జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జన్ , కాంట్రాక్ట్ డాక్టర్, కంటి వైద్యనిపుణుడు, అసిస్టెంట్ సర్జన్‌తో పాటు స్టాఫ్‌నర్సులు ఏడుగురు అందుబాటులో ఉన్నారు. ఫలితంగా గతంతో పోలిస్తే ఓపీ బాగా పెరిగింది. ప్రతినిత్యం 250 మంది రోగులు పీహెచ్‌సీకు వస్తున్నారు. సీహెచ్‌సీలో రాత్రి వేళల్లోనూ సేవలు అందించేందుకు ఒక డాక్టర్, ఒక నర్సు, ఒక అటెండర్ అందుబాటులో ఉంటున్నారు. రాత్రి వేళల్లో అత్యవసరంగా వచ్చే వారికి వైద్య సేవలను అందిస్తున్నారు. గత మేలో ఆస్పత్రిలో నూతనంగా ఎక్స్‌రే, బ్లడ్‌బ్యాంకు, స్కానింగ్ సెంటర్లను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. దీంతో చట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా వైద్యం అందుతోంది.

శస్త్రచికిత్సలు సైతం..

సీహెచ్‌సీలో శస్త్రచికిత్సలు సైతం చేస్తున్నారు. అదనపు ఆపరేషన్ థియేటర్‌ను మంత్రి కాకాణి చేతుల మీదుగా ప్రారంభించారు. ఇక్కడ 24 గంటల కడుపునొప్పి, కాన్పులు, కుటుంబ నియంత్రణ, హైడ్రోసిల్ తదితర ఆపరేషన్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచేందుకు కాంట్రాక్ట్ పద్ధతిపై పారిశుధ్య సిబ్బందిని నియమించారు. ఇటీవల ఆయుష్మాన్‌భవ కింద ప్రత్యేకంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు.



ఓపీకు హాజరైన రోగులు



ఎక్స్‌రే ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్(ఫైల్)

మెరుగైన వైద్యసేవలు



గతంలో కన్నా సీహెచ్‌సీలో వైద్యసేవలు మెరుగుపడ్డాయి. గతంలో వైద్య సిబ్బంది, పరికరాలు సక్రమంగా లేక, వైద్యం అందక రోగులు నెల్లూరు నగరానికి వెళ్లేవారు. ప్రస్తుతం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలతో చాలా సౌకర్యాలు ఏర్పడ్డాయి. పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి.

– వాకాటి శ్రీనివాసులురెడ్డి, హెచ్‌డీసీ మెంబర్, పొదలకూరు.

శస్త్రచికిత్సలు చేస్తున్నాం



సీహెచ్‌సీలో పేదలకు వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. సీహెచ్‌సీలో విజయవంతంగా శస్త్రచికిత్సలు చేస్తున్నాం. అన్ని రకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉండడంతో శస్త్రచికిత్సలు చేయగలుగుతున్నాం. రాత్రి వేళల్లో డాక్టర్, నర్సు వైద్యసేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ ప్రసాద్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పొదలకూరు

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



నాయబ్‌రసూల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వేణు, ఎస్సై విశ్వనాథరెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మర్రిపాడు మండలంలోని అచ్చమాంబ ఆలయం సమీపంలో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. మర్రిపాడు పంచాయతీ వార్డు మెంబర్ షేక్ నాయబ్ రసూల్(45) పేపర్ ప్లేట్లు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం అచ్చమాంబ గుడి వద్ద జరిగే అన్నదాన కార్యక్రమానికి పేపర్ ప్లేట్లు అందించేందుకు మోటార్‌సైకిల్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో ఆలయం వద్ద మోటార్‌సైకిల్‌ను వెనుకగా కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన నాయబ్‌రసూల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆత్మకూరు సీఐ వేణు, ఎస్సై విశ్వనాథ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి



దొరవారిసత్రం: మండలంలోని కలగుంట సమీపంలోని ఫ్లయిఓవర్ వద్ద డౌన్ లైన్ పట్టాలపై సుమారు 50 నుంచి 55 ఏళ్లు కలిగిన గుర్తుతెలియని మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. సూళ్లూరుపేట రైల్వే పోలీసుల వివరాల మేరకు.. చెన్నై నుంచి నెల్లూరు వైపునకు వెళ్లే రైలు నుంచి గుర్తుతెలియని వ్యక్తి శనివారం రాత్రి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. మృతుడు నీలిరంగు గళ్ల చొక్కా, నేవీ బ్లూ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై శివసామ్య తెలిపారు.

సీఎం జగన్ లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వమే పెద్దదిక్కుగా ఉండాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బోగోలులో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఆదివారం రాత్రి విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వివరించారు. పథకాలను అమలు చేయడమే కాకుండా వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేలా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేశారని తెలిపారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా పేదలందరికీ సకాలంలో పథకాలు అందుతున్నాయని వివరించారు. దివంగత సీఎం వైఎస్సార్ వారసుడిగా సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న ప్రజారంజకపాలనతో ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రజలంతా మళ్లీ వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ నాయకులు, పచ్చ మీడియా కలిసి చేస్తున్న వ్యతిరేక ప్రచారాన్ని, కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టేలా కార్యకర్తలు, పార్టీశ్రేణులు చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు, నాయకులు తూపిరి పెంచలయ, పర్రి అంకులయ్య, పాశం రవీంద్రబాబు, తుమ్మల రమణయ్య, మేకల శ్రీనివాసులు, ఏకే సుందర్‌రాజు, సుంకే మాల్యాద్రి, ఉప్పాల మాచర్ల, పాపన మల్లారెడ్డి, గందూరి శ్రీనివాసులు, కర్తం సురేందర్‌రెడ్డి, కూరపాటి మాధవరెడ్డి, సాధనాల మాధవ, పాపన మల్లారెడ్డి, మల్లి మోహన్, నర్సింహారెడ్డి, హరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పచెరువులో పడి వ్యక్తి మృతి

కందుకూరు: పట్టణంలోని ఉప్పుచెరువులో చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. అగ్నిమాపక ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని లుంబినీవనం కాలనీకి చెందిన షేక్ ఖలీల్‌బాషా(53) ఆదివారం సాయంత్రం చేపలవేట కోసం ఉప్పుచెరువులోకి వెళ్లాడు. చెరువులో దిగి చేపలు పడుతుండగా ఊబిలా ఉండే ప్రాంతంలో చిక్కుపోయి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై తిరుపతయ్య తెలిపారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



సెమీఫైనల్లో తలపడుతున్న శ్రీకాకుళం-విజయనగరం జిల్లాల బాలుర జట్లు



సెమీ ఫైనల్‌లో తలపడుతున్న గుంటూరు - ప్రకాశం జిల్లాల బాలికల జట్లు

- ఫైనల్‌కు చేరుకున్న గుంటూరు, విజయనగరం జట్లు

మైదుకూరు : వైఎస్సార్ జిల్లా మైదుకూరులో రాష్ట్రస్థాయి అండర్–17 వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బాలికల విభాగంలో గుంటూరు, బాలుర విభాగంలో విజయనగరం జిల్లా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన బాలికల విభాగం మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు – ప్రకాశం జిల్లాలు తలపడగా , ప్రకాశం జిల్లాను ఓడించి గుంటూరు ఫైనల్‌కు చేరింది. బాలుర విభాగంలో శ్రీకాకుళం – విజయనగరం జిల్లాల మధ్య మొదటి సెమీ ఫైనల్ పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో శ్రీకాకుళం జిల్లాను ఓడించి విజయనగరం జట్టు ఫైనల్‌కు చేరుకుంది. సోమవారం బాలికల విభాగంలో చిత్తూరు – కడప జిల్లాల మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్‌లో విజేత ఫైనల్లో గుంటూరు జిల్లాతో తలపడనుంది. అదే విధంగా బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి – అనంతపురం జిల్లాల మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌లో విజయనగరం జిల్లాతో ఆడనుంది.

క్రీడాస్ఫూర్తితో ఆడాలి

గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో ఆడాలని వైఎస్సార్ జిల్లాకు చెందిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు, వాలీబాల్ కోచ్ షామీర్ బాషా అన్నారు. ఆదివారం ఆయన క్రీడాకారులతో మాట్లాడారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి తర్వాత దేశానికి ప్రాతినిథ్యం వహించి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కార్యనిర్వాహక కార్యదర్శులు అరుణకుమారి, వసంత, మేధా డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నరసింహులు షామీర్‌బాషాను సత్కరించారు.

ఇంటి నుంచి వెళ్లిన విద్యార్థిని అప్పగింత



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై రంగనాథ్‌గౌడ్

కోవూరు : తల్లి మందలించిందని ఇల్లు వదిలి వెళ్లిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థినిని పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన కోవూరులో చోటు చేసుకుంది. వివరాలు.. పడుగుపాడులోని సుందరమహల్ ప్రాంతానికి చెందిన శ్రీలాస్య గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతోంది. ఆమె చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తోంది. ఖాళీ సమయంలో పార్ట్‌టైం జాబ్ చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం బంగారు చైనును పోగొట్టుకున్న శ్రీలాస్య విషయాన్ని ఇంట్లో తల్లికి చెప్పగా మందలించింది. చైన్ తీసుకురావాలని, లేకపోతే బాగుండదని హెచ్చరించడంతో కంగారుపడిన విద్యార్థిని శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి కుమార్తె రాకపోవడంతో తల్లి ఆందోళనతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా విద్యార్థి ఆచూకీ కనుగొన్నారు. తొలుత గూడూరు చెరువు సమీపంలోని టవర్ లొకేషన్‌లో ఉన్నట్లు గుర్తించి కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ గూడూరు సీఐకు సమాచారం అందజేశారు. గూడూరు పోలీసులు అక్కడికి చేరుకునే లోగా నాయుడుపేటటౌన్ పరిధిలోని టవర్ లొకేషన్‌లోకి వెళ్లింది. దీంతో నాయుడుపేట టౌన్ సీఐకు సమాచారం అందజేశారు. మరోసారి రూరల్ పరిధిలోని టవర్ లొకేషన్‌లోకి వెళ్లడంతో తిరుపతి వైపు వెళ్తున్నట్లుగా గుర్తించారు. కాగా నెల్లూరు నుంచి తిరుపతి బస్సు ఎక్కిన విద్యార్థిని ఏర్పేడు టోల్‌ప్లాజా వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి ఏం చేయాలో దిక్కుతోచక బస్సు దిగి మళ్లీ నెల్లూరు బస్సు ఎక్కింది నెల్లూరుకు చేరుకున్న వెంటనే ఒక్కసారిగా ఫోన్ స్విచ్ఛాఫ్ ఆగిపోయింది. చివరిసారిగా నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని టవర్ లొకేషన్ రావడంతో నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద నైట్‌రౌండ్స్‌లో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారి సహకారంతో ఆర్టీసీ బస్టాండ్‌లో కూర్చుని ఉన్న విద్యార్థిని పట్టుకున్నారు. అనంతరం కోవూరు పోలీసులకు అప్పగించారు. ఎస్సై రంగనాథ్‌గౌడ్ విద్యార్థినికి కౌన్సెలింగ్ ఇచ్చి ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించారు.

సాక్షి క్లాసిఫైడ్స్



డాక్యుమెంట్స్ పోయినవి
...చాగల్లు, ఉలవపాడు (మం), SPSR నెల్లూరు జిల్లా అను నా డాక్యుమెంట్స్ మిస్ అయినవి. సర్వే నెం. 793/1, 793/3, డాక్యుమెంట్ నెం–2568/1997, ఒరిజనల్ డాక్యుమెంట్స్ మిస్ అయినవి. ఎవరికైనను దొరికినచో నాకు తెలియజేయగలరు.
సెల్: 6305785428

SERVICES

BUSINESS OFFER
■ నెల్లూరు సిటీలో రన్నింగ్‌లో ఉన్న సూపర్ మార్కెట్ అమ్మబడును లేదా పెట్టుబడి పెట్టగల వారికి పార్ట్‌నర్‌షిప్ ఇవ్వబడును. ఆసక్తి గల వారు సంప్రదించండి సెల్ : 70326 10569. [NA-5930]

WANTED
■ Wanted System Male or Female Operators. Qlf: Degree Freshers. Time : 9.30AM to 6.30PM. Location : Nellore Town Only. Contact: 72888 03402, 90307 43622. [NA-5936]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 72077 76136. [M-1221760]

■ ప్రముఖుల ఇళ్ల వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. జీతం: 14-20K, వసతి + భోజనం, VJA. ✆ 91608 35559, 78158 35561 [B-447]

■ కోవూరు (మం), పడుగుపాడు నందు ITC Distribution కంపెనీలో పని చేయుటకు Sales man, Hawkers, Loading Boys, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సెల్ : 63033 84090. [N-1205774]

■ ప్రముఖ కంపెనీ నందు పని చేయుటకు డ్రైవర్లు కావలెను. సంప్ర : ప్లాట్ నెం: 40, ఉడ్ కాంప్లెక్స్, అయ్యప్పగుడి, ఫ్లై ఓవర్ దగ్గర, నెల్లూరు. సెల్ : 99636 62656, 83095 56900. [NA-5927]

■ బ్యాంక్ లోన్స్ ప్రాసెస్ నందు Telecaller కావలెను. Married Female, టార్గెట్స్ లేవు, జీతం : 12,000/-. ట్రంక్‌రోడ్, నెల్లూరు. వివరములకు సంప్రదించండి: 8885802000. [NA-22760]

■ శ్రీ మ్యారేజ్ కన్సల్టెన్సీ నందు పని చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. అడ్రస్: కొండాయపాళెం గేట్ ఎదురువీధి, నెల్లూరు. సంప్రదించండి: 88855 67277, 89850 48177. [NA-5917]

■ రాజరాజేశ్వరి ఆటోఫైనాన్స్, నిప్పోసెంటర్ నెల్లూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ & కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. వివరములకు సంప్రదించండి: 80966 44318. [NA-5934]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం:18K. Ph:9640468899/ 9640258899 [HA-189338]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP&డాక్టర్స్ కావలెను. జీతం: 13,000/- - 35000/- ఫ్రీ రూమ్ + భోజనం. HYD. Ph: 7995374999 [HA-684]

■ నెల్లూరు టౌన్ ముత్తుకూరు రోడ్ లో ఉన్న పెట్రోల్ బంక్ నందు పనిచేయుటకు యువతీ / యువకులు కావలెను. ఫోన్ : 8977729204 [HA-30259]

■ ప్రముఖ పాలిటెక్నిక్ కాలేజి నందు ECE - Electronic &Communications Dept. నందు Teaching Faculty, Hostel Warden, Watch man కావలెను. వివరాలకు సంప్రదించండి. సెల్: 99123 42089, 85006 63444. [N-755402]

■ రాఘవ ఆటో ఫైనాన్స్ నందు పని చేయుటకు అకౌంటెంట్ (M) కావలెను. అర్హత : B.Com (Tally), B.Tech or MBA, వయస్సు : 23-32 సం॥ & ఆఫీస్ స్టాఫ్ (M) కావలెను. అర్హత : డిగ్రీ. సంప్ర : 79934 54965, 91000 55963. [NA-5926]

■ నెల్లూరు సిటీలో ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు 40 సం. లోపు స్టాఫ్ అసిస్టెంట్స్ 10 మంది. అర్హత (ఏదైనా డిగ్రీ) లోకల్ వారికి ప్రాధాన్యత. అకౌంటెంట్స్ -3, డ్రైవర్లు -2 కావలెను. వివరాలకు సంప్రదించండి. సెల్ : 94942 88807. [NA-22765]

■ ప్రముఖ Real Estate సంస్థకి Bike కలిగిన స్త్రీ / పురుష Marketing Executives 5 మంది కావలెను. జీతం: 12,000 + TA + Inective. ప్రతి Plot Sale మీద రూ.10,000 వస్తుంది. Telecallers స్త్రీలు కావలెను. జీతం: 10,000 + TA. సెల్: 78010 34111. [NA-22768]

■ నెల్లూరులో ప్రముఖ FMCG కంపెనీలో పని చేయుటకు సేల్స్‌మెన్ (జీతం: 20,000), ఆపరేటర్స్ (జీతం: 15000), గోడౌన్ ఇన్‌చార్జ్, క్యాషియర్స్ (15000), డ్రైవర్స్ & డెలివరీ బాయ్స్ కావలెను. సంప్ర : 83743 44449, 77990 68899. [NA-22778]

■ నెల్లూరు జిల్లాలో Paytm నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. కనీస విద్యా అర్హత : 10th Class. 30,000/- వరకు సంపాదించుకోవచ్చు. వివరములకు సంప్రదించవలసిన నెంబర్లు. 8886677626, 7729066624, 9395509666, 8309207038. [NA-22777]

EDUCATION

DIRECT FINAL YEAR
■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629 [T-4637]

REAL ESTATE

PLOT FOR SALE
■ Open Plots : అం॥30వేలు to 1లక్ష, ధనలక్ష్మీపురం, అల్లీపురం, కసుమూరు, రాజుపాళెం, గూడూరు, పొదలకూరు. క్లియర్ టైటిల్స్ & స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్రదించండి: 88856 83888. [NA-22764]

■ నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టుకు సమీపంలో NH కు అనుకొని ఉన్న కమర్షియల్ భూములు, ప్లాటులు మామిడితోటలు అమ్మకం, కొనుగోలుకు సం॥ ✆ 79817 44848. [O-759031]

TO-LET
■ నెల్లూరు, పొగతోటలో గ్రౌండ్ ఫ్లోర్ నందు కన్సల్టేషన్ రూమ్స్, ఇన్ పేషంట్ రూమ్స్, బెడ్ లిఫ్ట్, జనరేటర్ మరియు అన్ని ఫెసిలిటీస్ తో హాస్పిటల్స్‌కి అనువైన నార్త్ ఈస్ట్ కార్నర్ (కేర్ డెంటల్ బిల్డింగ్) నందు రెంట్‌కి కలదు. సంప్ర: 86861 78918, 94406 66777. [NA-10549]

ప్రకటన గోరంత
స్పందన కొండంత

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.